

ఖమ్మం మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 5 జూలై 2024 | BHADRADRI KOTHAGUDEM



మాజీ సీఎం కేసీఆర్‌ను సన్మానించి సంఘీభావం తెలుపుతున్న కేశ్వాపురం గ్రామస్తులు

# అమ్ము / ఆగు / దామా!

- ఆందోళన, సందేహంలో మిర్చి రైతులు
- మరోవైపు భారీగా పడిపోతున్న మిర్చి ధరలు
- ఏసీలో నిల్వ పెట్టిన రైతులకు భారీ నష్టం
- ఒక్కరోజులోనే క్వింటాకు రూ.2 వేల తగ్గుదల
- బుధవారం ధర రూ.19,500
- గురువారం ధర రూ.17,600



ఖమ్మం వ్యవసాయం, జూలై 4 : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. సీజన్‌లో పంట చేతికి వచ్చిన సమయంలో మార్కెట్లో తేజారకం పంటకు మంచి డిమాండ్ పలికింది. ఒకానొక దశలో క్వింటా రూ.22 వేలకు పైచిలుకు కూడా పలికింది. సీజన్ చివరిలోనూ రూ.20 వేల నుంచి రూ.21 వేల వరకు గరిష్ఠ ధర పలికింది. అయితే రాబోయే రోజుల్లో క్వింటా రూ.25 వేలకు పైగా పలికే అవకాశం ఉందంటూ గత సీజన్‌లో మిర్చి రైతుల వద్ద కొందరు అడ్తీ వ్యాపారులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. చైనా కంపెనీలు ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదని, త్వరలోనే కొనుగోళ్లు చేపడుతాయని ఆశ చూపారు. దీంతో వేలాది మంది రైతులు జిల్లావ్యాప్తంగా ఉన్న కోల్డ్ స్టోరేజీల్లో పంటను నిల్వ చేసుకున్నారు. మరికొందరు వ్యాపారులు కూడా నిల్వలు పెట్టుకున్నారు. తీరా ఈ సీజన్‌లో చూస్తే ధరలు పాతాళంలో ఉన్నాయి. దీంతో ఏసీల్లో నిల్వ పెట్టుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. గత సీజన్‌లో విక్రయించుకున్నా బాగుండేదేమోనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ పెట్టుకున్న పంటను ఇప్పటికైనా అమ్ముకుందామా.. లేదా మరికొద్ది రోజుల పాటు ఆపుకుందామా.. అనేది తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు.

### ఈ సీజన్‌లోనే ధర సగానికి సగం తగ్గింది



ఈ సీజన్‌లో మిర్చిపంట ధర సగానికి సగం తగ్గుతుందని అనుకోలేదు. పంట వచ్చిన సమయంలో నేను ఇదే మార్కెట్‌కు తీసుకొచ్చాను. అయితే అప్పుడు క్వింటా రూ.20 వేలు పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. కానీ.. ఈరోజు చూస్తే అదే పంటకు క్వింటా రూ.10 వేలు మాత్రమే ధర పలికింది. ఆ సీజన్‌లోనే కొంత పంటను అమ్ముకున్నాను. మిగిలిన పంటను ఈరోజు తీసుకొచ్చాను. కానీ.. ధర చూస్తే ఆశ్చర్యమేస్తోంది. ఏసీలో పంట దాచుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**–మేకపోతుల వీరబాబు, రైతు, చింతపల్లి**

### ఒక్కరోజు వ్యవధిలోనే రూ.2 వేల తగ్గుదల

ఖమ్మం ఏఎంసీలో తేజారకం ఏసీ మిర్చి ధర ఒక్కరోజు వ్యవధిలోనే సుమారు రూ.2 వేలు తగ్గడంతో మిర్చి రైతులు ఆందోళనకు గురయ్యారు. వారం రోజుల క్రితం వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో క్వింటా ఏసీ రకం ధర రూ.19,500 నుంచి రూ.20 వేల వరకూ గరిష్ఠ ధర పలికింది. బుధవారం కూడా రూ.19,500 ధర పలికింది. అయితే ఏసీ రకం పంటకు ఆ ధర చాలా తక్కువే అయినప్పటికీ రైతులు మరి కొంత కాలం వేచి చూద్దామనే ధోరణితో ఉంటూ వస్తున్నారు. తీరా గురువారం ఉదయం జరిగిన జెండాపాట సమయానికి కేవలం 34 మంది రైతులు 928 బస్తాలను మాత్రమే యార్డుకు తీసుకొచ్చారు. అనంతరం జరిగిన జెండాపాటలో క్వింటా గరిష్ఠ ధర రూ.17,600 పలుకగా.. మధ్య ధర రూ.16,500, కనిష్ఠ ధర రూ.10 వేలు పలికింది. సాధారణ రకం పంటకు క్వింటా గరిష్ఠ ధర రూ.10 వేలు, కనిష్ఠ ధర రూ.9,800, తాలు రకం పంటకు గరిష్ఠ ధర రూ.7,500, కనిష్ఠ ధర రూ.5,750 చొప్పున పలికాయి. ప్రస్తుతం వానకాలం వ్యవసాయ పనులు జోరందుకోవడంతో పెట్టుబడి కోసం రైతులు పంటను మార్కెట్లో విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. సరిగ్గా ఈ సమయంలో మార్కెట్లో మిర్చి పంట ధరలు భారీగా పడిపోతుండడంతో మిర్చి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఏకంగా రూ.2 వేల ధర తగ్గడాన్ని కేవలం ఖమ్మం మార్కెట్లోనే చూస్తున్నామని రైతులు చెబుతుండడం గమనార్హం.

### కోల్డ్ స్టోరేజీల్లో 38 లక్షల బస్తాల నిల్వలు..

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని కోల్డ్ స్టోరేజీలు పంట ఉత్పత్తులతో నిండిపోయాయి. మొత్తం 48 కోల్డ్ స్టోరేజీల్లో ప్రస్తుతం 38,19,274 బస్తాలు నిల్వ ఉన్నాయి. కానీ.. రోజురోజుకూ మిర్చి పంట ధర తగ్గుతుండడంతో ఇంత కాలం పంటను నిల్వ చేసుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గెలిచినా.. ఓడినా మీతోనే నడుస్తాం..

- తిరుమలాయపాలేన్ని సస్యశ్యామలం చేసిన ఘనత మీదే..
- కేసీఆర్‌ను కలిసి సంఘీభావం తెలిపిన కేశ్వాపురం గ్రామస్తులు, రైతులు

తిరుమలాయపాలెం, జూలై 4 : 'అత్యంత కరువు పీడిత ప్రాంతమైన తిరుమలాయపాలెం మండలాన్ని కోనసీమగా మార్చారు. రెండు పంటలు పండేలా సస్యశ్యామలం చేశారు. ఆ ఘనత మీకు, మీ ప్రభుత్వానికే దక్కుతుంది. గెలిచినా.. ఓడినా మేము మీ వెంటే ఉంటాం.. ఎన్నాళ్లైనా మీతోనే కలిసి నడుస్తాం' అంటూ తిరుమలాయపాలెం మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. మీ ప్రభుత్వం చేపట్టిన శ్రీభక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా తిరుమలాయపాలెం మండలం సస్యశ్యామలంగా మారింది. భూముల ధరలు విపరీతంగా పెరిగి మాకు మేలు జరిగిందని వివరించారు. మీ పాలనలో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు కాల్వల తవ్వకానికి మా భూములు ఇచ్చాం. ఆ భూములకు సంబంధించి ఇంకా కొందరికి పరిహారం అందాల్సి ఉందని కేసీఆర్‌కు వివరించారు. రైతుల మాటలు ఆసక్తిగా విన్న కేసీఆర్ వారిని అభినందించడంతోపాటు ఎంతో సంతోషించారు. వారితో కలిసి ఫొటోలు దిగి.. భోజనాలు పెట్టి పంపించారు. కార్యక్రమంలో కేశ్వాపురం బీఆర్‌ఎస్ నాయకులు జక్కుల వీరన్న, వీరెల్లి నవీన్, ఐతనబోయిన వీరస్వామి, ఈదుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్



కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

పాల్వంచ, జూలై 4 : కాంగ్రెస్ ప్రభుత్వం తమకు గతంలో ఇచ్చిన మాట తప్పడంపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పోరుబాట పట్టారు. జీవో నంబర్ 10ని రద్దు చేయాలని, న్యాయబద్ధమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గతంలో అంగీకరించిన విధంగా టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద అందించాలని డిమాండ్ చేశారు. అయితే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి జూలై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, సత్య, విజయశీల, వీరభద్రమ్మ, పాయం రాధాకుమారి, మరియ, సూరమ్మ, కృష్ణవేణి, సారమ్మ, లలిత, నాగమణి, భాను, రాధ, హేమలత, కల్యాణి, అనసూయ, కళావతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి సారూ..

- ఖమ్మం కలెక్టర్‌ను కలిసి చేతులెత్తి మొరపెట్టుకున్న రైతు ప్రభాకర్ కుటుంబ సభ్యులు
- వారి వెంట వెళ్లిన జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల



కలెక్టరేట్ వద్ద ప్రభాకర్ కుటుంబ సభ్యులతో ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు

రఘునాథపాలెం/మామిళ్లగూడెం, జూలై 4: 'నా కొడుకు ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి సారూ..' అంటూ ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు రైతు ప్రభాకర్ తండ్రి బోజెడ్ల వీరభద్రయ్య ఖమ్మం కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. గడ్డం పట్టుకొని బతిమాలారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. అదే సమయంలో రైతు ప్రభాకర్ కుమార్తె, కుమారుడు కూడా కలెక్టర్‌కు రెండు చేతులూ జోడించి మొక్కారు. తమకు జరిగిన అన్యాయంపైనా; రైతు ప్రభాకర్ ఆత్మహత్యపైనా అతడి తండ్రి, అతడి కుమార్తె, కుమారుడు గురువారం కలిసి కలెక్టర్‌ను వేడుకుంటున్న తీరు అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది.

### జడ్పీ చైర్మన్‌తో కలిసి కలెక్టరేట్‌కు..

తన సాగు భూమిని కొందరు ఆక్రమించడం, మత్స్య సొసైటీ బాధ్యులు జేసీబీ యంత్రాలతో వచ్చి తవ్వడం వంటి కారణాల నేపథ్యంలో ఖమ్మం కలెక్టరేట్‌లో ఫిర్యాదు ఇచ్చి మరీ చింతకాని మండలం ప్రొద్దుటూరు రైతు బోజెడ్ల ప్రభాకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో తమ న్యాయం చేయాలని కోరుతూ అతడి కుటుంబ సభ్యులు.. జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులతో కలిసి గురువారం ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చారు. పట్టాదారు పాస్‌పుస్తకాల ఆధారంగా తమ భూమిని తిరిగి తమకు ఇప్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను వేడుకున్నారు. అలాగే, ఆత్మహత్యకు బాధ్యులైన దోషులను కూడా కఠినంగా శిక్షించాలని విన్నవించారు. కాగా, బాధిత కుటుంబీకుల మొరపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : జడ్పీ చైర్మన్

కలెక్టర్‌ను కలిసి బయటకు వచ్చిన అనంతరం ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. రైతు ప్రభాకర్ భూమిని చెరువులో కలిపి అతడి ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ రైతు కుటుంబంలోని పిల్లల పరిస్థితి చూసి ప్రతి ఒక్కరూ చలించిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ.. ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఇప్పటికీ పరామర్శించకపోవడం విచారకరమని అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.

## భూ వివాదంలో రైతు ఆత్మహత్యాయత్నం

- ప్రొద్దుటూరు రైతు బలవన్మరణం భగ్గుమంటుండగానే మరో దారుణం
- ఈ వివాదంలో సాక్షాత్తూ ఆర్‌టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్ పేరు
- అతడు తన భూమిని ఆక్రమించాడంటూ పురుగులమందు తాగిన రైతు



పురుగులమందు తాగి ట్రాక్టర్‌కు అడ్డుగా పడుకున్న రైతు భద్రయ్య

కారేపల్లి, జూలై 4 : భూవివాదాల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో తాజాగా మరో రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. చింతకాని మండలం ప్రొద్దుటూరు రైతు బోజెడ్ల ప్రభాకర్ బలవన్మరణం పొందిన వివాదం భగ్గుమంటుండగానే మరో దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. కాగా, తాజా ఘటనలో సాక్షాత్తూ ఆర్‌టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్.. తన భూమిని ఆక్రమించాడంటూ గురువారం ఓ రైతు పురుగుల మందు తాగాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన పచ్చిపాల భద్రయ్య, సోమయ్య, రామయ్య, మల్లయ్య అనే వ్యక్తులు అన్నదమ్ములు. వీరిలో భద్రయ్యది మినహా మిగతా వారందరికీ వారి వాటాగా వచ్చిన భూమిని ఆర్‌టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులు కొనుగోలు చేశారు. శంకర్‌నాయక్ హోదా, అధికారుల అండతో సర్వే నెంబర్లకు బై నెంబర్లు వేసి పక్కనే ఉన్న పచ్చిపాల భద్రయ్యకు చెందిన 1.20 ఎకరాల భూమిని కూడా కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించారు. అయితే శంకర్‌నాయకే తమ భూమిని ఆక్రమించాడని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. కాగా, ఈ భూమి వివాదంపై ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఇంజక్షన్ ఆర్డర్లు తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో గురువారం పచ్చిపాల భద్రయ్యకు చెందిన భూమిని శంకర్‌నాయక్‌కు చెందిన మనుషులు ట్రాక్టర్లతో దున్నిస్తున్నారు. దీనిని గమనించిన భద్రయ్య, అతడి భార్య భాగ్యమ్మ అక్కడికి వచ్చి వారిని అడ్డుకున్నారు. తమ భూమిని దున్నవద్దని, తమకు ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందని చెప్పారు. అయినప్పటికీ శంకర్‌నాయక్ మనుషులు వినిపించుకోకుండా సదరు భూమిని దున్నిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన పచ్చిపాల భద్రయ్య.. తన చేను కోసం తెచ్చిన పురుగుల మందును తాగాడు. వెంటనే ఆందోళనకు గురైన అతడి కుటుంబ సభ్యులు.. గ్రామస్తుల సహకారంతో 108 వాహనంలో ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, అతడి పరిస్థితి విషమంగా ఉందని బాధితుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అలాగే, తమకు న్యాయం చేయాలని కోరుతూ అతడి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భద్రయ్య భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## 'గ్రీన్‌ఫీల్డ్ హైవే'కు బ్రేకులు

- హైకోర్టును ఆశ్రయించిన పలువురు రైతులు
- స్టే విధించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

రఘునాథపాలెం, జూలై 4: నాగ్‌పూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు బ్రేకులు పడ్డాయి. రఘునాథపాలెం, వీ వెంకటాయపాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతుల విజ్ఞప్తి మేరకు హైకోర్టు స్టే విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. నాగ్‌పూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల, రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం సెక్షన్ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులు, ప్లాట్లు కోల్పోతున్న యజమానులు 29 మంది కలిసి ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. నేషనల్ హైవే అథారిటీ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ హైవే అలైన్‌మెంట్ జరిగిందని, ఎక్స్‌ప్రెస్ హైవే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మధ్యలోంచి వెళ్లడం ద్వారా మూడు లక్షల మంది నగర ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని బాధితుల తరపున హైకోర్టు న్యాయవాది ఈ.హరిబాబు వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. సదరు రైతుల భూములను స్వాధీనం చేసుకోవద్దంటూ తాత్కాలిక స్టే ఇచ్చింది. హైకోర్టు నుంచి తదుపరి తీర్పు వెలువడే వరకు నిబంధనలను పాటించాలని హైకోర్టు తన స్టేలో పేర్కొన్నట్లు బాధిత రైతులు తెలిపారు.

## నాలుగు నెలలుగా ఆకలి కేకలు

- ఖమ్మం పెద్దాసుపత్రి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కష్టకాలం
- జిల్లా సార్వజనీన వైద్యశాలలో పస్తులతోనే పనిచేస్తున్న 259 మంది
- సర్కారు నుంచి పైసా కూడా రావడం లేదంటున్న ఆసుపత్రి అధికారులు
- ఆగ్రహంతో రోడ్డెక్కిన వేతన జీవులు.. నిరవధిక సమ్మెకు పిలుపు




ఖమ్మంలో ప్రదర్శన నిర్వహిస్తున్న పెద్దాసుపత్రి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు

ఖమ్మం సిటీ, జూలై 4 : అలవిగాని హామీలతో అరచేతిలో స్వర్గాన్ని చూపించారు. అధికారాన్ని 'చే'జిక్కించుకున్నారు. కట్ చేస్తే.. నెలవారీ వేతన జీవుల వైపు కన్నెత్తి చూడడం కూడా మానేశారు. 'ఇంటిల్లిపాదీ పస్తులుంటున్నాం మహాప్రభో..' అని మొరపెట్టుకున్నా ఆలకించే అమాత్యుడే కానరావడం లేదు. దీంతో కడుపు మండిన కార్మికులు కన్నెర్ర చేశారు. విధులు బహిష్కరించి వీధుల్లోకి వచ్చారు. జీతాలు చెల్లించే వరకు పనిలోకి వెళ్లేది లేదని సమ్మెకు దిగారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరిగిన ఘటన కాదు.. సాక్షాత్తూ ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఆర్తనాదాల దృశ్యం. తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత పెద్దాసుపత్రికి కష్టకాలం దాపురించింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేద, మధ్యతరగతి వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన దవాఖాన.. ఇప్పుడు సమస్యల సుడిగుండంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది.

### నాలుగు నెలలుగా పెండింగ్..

పెద్దాసుపత్రిలోని పారిశుధ్యం, గార్డెన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, మెడికల్ షాపులు, ల్యాబ్‌లో మొత్తం 259 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.12,093 వేతనంగా అందించాలి. పీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపులో పోను రూ.11 వేలు చేతికి వస్తాయి. కరోనా కష్టకాలంలోనూ వీరు చావుకు భయపడకుండా విధులు నిర్వర్తించారు. సిబ్బంది సేవలను గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం నెలవారీగా వేతనాలు చెల్లిస్తూ వచ్చింది. ఎప్పుడైతే రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిందో నాటి నుంచి పెద్దాసుపత్రి కార్మికులకు కష్టకాలం దాపురించింది. అధికారం చేపట్టిన ఈ ఏడు నెలల కాలంలో గడిచిన నాలుగు నెలలుగా వీరికి వేతనాలు ఇవ్వడం లేదు. వేతనం ఏదని కాంట్రాక్టర్‌ను అడిగితే 'ప్రభుత్వం నాకు నిధులిస్తే.. నేను మీకు జీతం ఇస్తా' అంటూ చేతులెత్తేస్తున్నాడు. అధికారులకు మొరపెట్టుకుంటనే ప్రభుత్వం నుంచి పైసా రాలేదని సమాధానమిస్తున్నారు. దీంతో విసిగిపోయిన కార్మికులు.. నిరవధిక సమ్మెకు దిగారు. వారికి ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ కార్మిక సంఘాలు మద్దతు పలికాయి. దీనిలో భాగంగా గురువారం విధులు బహిష్కరించి నగరంలో ప్రదర్శన నిర్వహించారు.

## గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా




హెడ్డాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, జూలై 4 : సింగరేణిలో బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పితాంబరం, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, త్యాగరాజన్‌ల నేతృత్వంలో కార్పొరేట్ ఏరియా సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి మాత్రమే అప్పగించాలని, 2015 ఎంఎండీఆర్ చట్టంలో పొందుపర్చిన 17ఏ ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలకే గనులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బొగ్గు బ్లాకుల వేలంలో పొందుపర్చిన మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. అనంతరం జీఎం పర్సనల్ దీక్షితులుకు వినతిపత్రం అందజేశారు.

## రేపు స్విమ్మింగ్ పోటీల్లో ఎంపికలు

కొత్తగూడెం టౌన్, జూలై 4: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్విమ్మింగ్ క్రీడాకారులకు సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఈ నెల 6న ఎంపికలు నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హనుమంతరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం సీఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు రెండు జిల్లాల క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీల్లో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, వివరాల కోసం 9866923395, 9908053539 నంబర్లలో సంప్రదించాలని కోరారు.